మనం
కడప | అన్నమయ్య

## శ్రీ ఉమాదేవి సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు




ఓబులవారిపల్లి,అక్టోబర్ 16, మనం న్యూస్: తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలోని ఓబులవారిపల్లి మండలంలోని బి కమపల్లిలో వెలసిన శ్రీ ఉమాదేవి సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుంది. వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆరవ రోజున ఆశ్వయుజ మాస శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని, విద్యాధిదేవత అయిన శ్రీ మహాసరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్ర వేడుకలను ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మహాసరస్వతి అమ్మవారి మూల విగ్రహానికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించడంతో పాటు, అత్యంత పవిత్రమైన మేధాసూక్తం సహితంగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపించారు.

# అన్నమయ్య జిల్లాలో నామినేషన్ల వేళ రణరంగం

**పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత - రాళ్లదాడి, వాహనాల దహనం.. పోలీసుల గాల్లోకి కాల్పులు**

**పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌పై రాళ్లదాడి.. పోలీసుల కాల్పులు**

**రాయచోటిలో వాహనాల విధ్వంసం.. అగ్నికి ఆహుతి - పరస్పర ఆరోపణలు.. భారీ బందోబస్తు**



మనం ప్రతినిధి మదనపల్లి అక్టోబర్ 16
స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే అన్నమయ్య జిల్లాలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుంగనూరులో వైసీపీ అభ్యర్థులతో కలిసి నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న రాజంపేట ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై ప్రత్యర్థులు రాళ్లదాడికి పాల్పడటంతో పలు వాహనాలు ధ్వంసమై, కొందరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పగా, అల్లరిమూకలను చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది.

మరోవైపు రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీ, వైసీపీ కార్యాలయ పరిసరాల్లోనూ ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులకు తెగబడ్డాయి. ఈ ఘర్షణల్లో సుమారు 15 కార్లు ధ్వంసం కాగా, నాలుగు కార్లకు నిప్పంటించడంతో పరిస్థితి రణరంగాన్ని తలపించింది. ఈ హింసాత్మక ఘటనలపై ఇరు పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటుండగా, జిల్లాలో మరింత అశాంతి చెలరేగకుండా పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో పోలీసులు అదనపు బలగాలను మోహరించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రాళ్లదాడి, వాహనాల దహనం.. పోలీసుల గాల్లోకి కాల్పులు**

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే అన్నమయ్య జిల్లాలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. పుంగనూరు, రాయచోటి నియోజక వర్గాల్లో టీడీపీ, వైసీపీ శ్రేణులు పరస్పరం దాడులకు దిగడంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌పై రాళ్లదాడి.. పోలీసుల కాల్పులు**

పుంగనూరులో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి రాజంపేట ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన కాన్వాయ్ వెళ్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గం పెద్దఎత్తున రాళ్లదాడికి పాల్పడింది. ఈ దాడిలో ఎంపీ కాన్వాయ్‌లోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అల్లరిమూకలను చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపారు.

**రాయచోటిలో వాహనాల విధ్వంసం.. అగ్నికి ఆహుతి**

రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీతో పాటు స్థానిక వైసీపీ కార్యాలయం సమీపంలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. కార్యకర్తలు కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. ఈ విధ్వంసంలో సుమారు 15 కార్ల అద్దాలు ధ్వంసమవగా, మరో నాలుగు కార్లకు ఆందోళనకారులు నిప్పంటించారు. దట్టమైన పొగలు, మంటలతో ఆ ప్రాంతం యుద్ధ రంగాన్ని తలపించింది.

**పరస్పర ఆరోపణలు.. భారీ బందోబస్తు**

జరిగిన హింసాత్మక ఘటనలపై టీడీపీ, వైసీపీ నాయకులు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రత్యర్థులే ముందుగా రెచ్చగొట్టారని ఇరువర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించారు. కీలక కూడళ్లలో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాడులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

# రాజంపేటలో పోలీసుల కవాతు

**ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - పట్టణంలో ఖాకీల పహారా**

**నేటి నుంచి 21 వరకు 163 (144) సెక్షన్ అమలు**

**రాజంపేటలో ఆంక్షల చట్రం - మున్సిపాలిటీ పరిధిలో రూట్ మార్చ్**

మనం రాజంపేట ప్రతినిధి అక్టోబర్ 16: రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (-2023లోని సెక్షన్ 163 (గతంలో అమలులో ఉన్న సెక్షన్ 144) ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు రాజంపేట అర్బన్ పోలీసులు వెల్లడించారు. ఈ నిబంధనల ప్రకారం నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమికూడరాదని, అనుమతి లేని సభలు, సమావేశాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. అలాగే పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, నిరసన కార్యక్రమాలు లేదా బహిరంగ సభలు నిర్వహించడానికి వీల్లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలు పెంచేలా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. కుల, మత, రాజకీయ అంశాల పేరుతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ప్రజల్లో భయాందోళనలు కలిగించే చర్యలకు పాల్పడడం పూర్తిగా నిషిద్ధమని హెచ్చరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు. అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాల రాకపోకలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలిగించవద్దని సూచించారు. నిషేధాజ్ఞల అమలులో భాగంగా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఏర్పాటు చేసిన పోలీసు పికెట్లు, తనిఖీలు, బందోబస్తు విధులకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని అధికారులు కోరారు. నిబంధనలను ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అర్బన్ సీఐ హెచ్చరించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు చట్టాన్ని గౌరవిస్తూ, పోలీసు శాఖకు సహకరించి రాజంపేటలో శాంతియుత వాతావరణం నెలకొనేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్ కడప జిల్లాలో మొదటి రోజే జోరందుకున్న నామినేషన్ల పర్వం

**(ఛైర్‌పర్సన్,మేయర్ పదవులకు 6, వార్డు సభ్యులకు 68 నామినేషన్లు దాఖలు)**

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 16
వైఎస్సార్ కడప జిల్లాలోని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. శుక్రవారం మొదటి రోజే జిల్లావ్యాప్తంగా వివిధ పురపాలక సంఘాల్లో ఛైర్‌పర్సన్/మేయర్ స్థానాలకు మొత్తం 6, వార్డు సభ్యుల స్థానాలకు 68 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

పులివెందుల మున్సిపాలిటీలో అత్యధికంగా 28 వార్డు సభ్యుల నామినేషన్లతో పాటు ఒక ఛైర్‌పర్సన్ నామినేషన్ దాఖలైంది. కడప నగరపాలక సంస్థ (కార్పొరేషన్)లో ఇద్దరు మేయర్ అభ్యర్థులు, 10మంది కార్పొరేటర్ అభ్యర్థులు పత్రాలు సమర్పించారు. ప్రొద్దుటూరులో ఛైర్‌పర్సన్ పదవికి ఎవరూ దాఖలు చేయనప్పటికీ, వార్డులకు సంబంధించి 13 నామినేషన్లు వచ్చాయి.

**మున్సిపాలిటీల వారీగా నామినేషన్ల వివరాలు:**

పులివెందుల (40 వార్డులు): 28 వార్డు సభ్యుల నామినేషన్లు, ఛైర్‌పర్సన్ పదవికి 1 నామినేషన్ దాఖలయ్యాయి.

కడప కార్పొరేషన్: 10 మంది కార్పొరేటర్ అభ్యర్థులు, మేయర్ స్థానానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

ప్రొద్దుటూరు: వార్డు సభ్యుల స్థానాలకు 13 నామినేషన్లు దాఖలు కాగా, ఛైర్‌పర్సన్ పదవికి ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

బద్వేలు (40వార్డులు): 9వార్డు సభ్యుల నామినేషన్లు, ఛైర్‌పర్సన్ పదవికి 1 నామినేషన్ వచ్చాయి.

మైదుకూరు (32 వార్డులు): వార్డు సభ్యుల పదవులకు 7 నామినేషన్లు దాఖలయ్యాయి.

జమ్మలమడుగు (32వార్డులు): వార్డు సభ్యుడికి1, ఛైర్‌పర్సన్ పదవికి 1 నామినేషన్ దాఖలయ్యాయి.

కమలాపురం (23 వార్డులు): వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు, ఛైర్‌పర్సన్ పదవికి మాత్రం 1నామినేషన్ వచ్చింది. రాజంపేట (32 వార్డులు), ఎర్రగుంట్ల (28వార్డులు): ఈ రెండు మున్సిపాలిటీల్లో మొదటి రోజు వార్డులకు గానీ, ఛైర్‌పర్సన్ పదవికి గానీ ఒక్క నామినేషన్ కూడా నమోదు కాలేదు.

# రాజంపేట టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ దొంతం గాయత్రి

**అధికారికంగా ఖరారు చేసిన సీఎం చంద్రబాబు! - ఉన్నత విద్యావంతురాలైన యువ వైద్యురాలికే మొగ్గు చూపిన అధినేత**

**బీసీ మహిళా కోటాలో ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక - హర్షం వ్యక్తం చేస్తున్న రాజంపేట కూటమి శ్రేణులు**

మనం ప్రతినిధి, రాజంపేట అక్టోబర్ 16: రాజంపేట మున్సిపల్ ఎన్నికల పోరులో తెలుగుదేశం పార్టీ కీలక ముందడుగు వేసింది. రాజంపేట మున్సిపల్ అభ్యర్థిగా ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ దొంతం గాయత్రి పేరును టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి సంతకంతో కూడిన అధికారిక జాబితా విడుదలైంది. మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో, పార్టీలో ఎంతోమంది ఆశావహులు ఉన్నప్పటికీ... విద్యార్హతలు, ప్రజల్లో ఉన్న ఆదరణ, సేవా దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని సీఎం చంద్రబాబు యువ వైద్యురాలికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**పార్టీ విధేయతకు దక్కిన గుర్తింపు**



డాక్టర్ దొంతం గాయత్రి...

ప్రముఖ విద్యావేత్త, వ్యాపారవేత్త దొంతం శివప్రసాద్ (గంప శివ) కుమార్తె. దశాబ్దాలుగా వీరి కుటుంబం టీడీపీకి నమ్మకమైన అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. పార్టీ పట్ల వారికున్న విధేయత, సేవా భావాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమెకు రాజంపేట బాధ్యతలు అప్పగించారు. విద్యావంతురాలైన వైద్యురాలికి అవకాశం కల్పించడంపై రాజంపేట పట్టణ ప్రజలతో పాటు టీడీపీ-కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ?సీఎం చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కూటమి నేతలను సమన్వయం చేసుకుని రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ఎన్నికల్లో ఛైర్‌పర్సన్‌గా గెలిపించి సీఎంకు కానుకగా ఇస్తామని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

## శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

రైల్వే కోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని స్థానిక పాత బజారులో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం రోజున శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ప్రత్యేకంగా శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జ్ఞానప్రదాత అయిన సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దివ్య రూపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుందని, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ ఓ



ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



## ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుగుణంగా నడుచుకోవాలి

### తహసీల్దార్ మురళీకృష్ణ

### పుల్లంపేట మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అధికారుల అవగాహన సదస్సు

పుల్లంపేట అక్టోబర్ 16 (మనంన్యూస్)స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) పై అవగాహన కల్పించేందుకు మండల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తహసీల్దార్ శ్రీ మురళీకృష్ణ, ఎంపీడీవో శ్రీ శ్రీనివాసులు, ఎస్హెచ్ఓ శ్రీ చిన్న రెడ్డప్పల ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా వీఆర్వోలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు కార్యాలయ సిబ్బందికి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తి అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో అనధికార బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయకూడదని, ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచించారు.ఎక్కడైనా చట్టవ్యతిరేక పనులు జరిగితే మండల అధికారులు వెంటనే దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీ మురళీ కృష్ణ ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అలసత్వం చూపకూడదని ఆయన స్పష్టం చేశారు.అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రక్రియకు స్వచ్ఛందంగా సహకరించాలని ఎంపీడీవో శ్రీ శ్రీనివాసులు కోరారు.ఎన్నికలుప్రశాంతంగా,పారదర్శకంగా జరగాలంటే అందరి సహకారం అవసరమని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పుల్లంపేట మారమ్మ గుడిలో నవరాత్రుల శోభ

### సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు



పుల్లంపేట అక్టోబర్ 16 (మనంన్యూస్ )పుల్లంపేట మెయిన్ బజారులో ఉన్న మారమ్మ గుడి దేవస్థానంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రులలో భాగంగా, ఈ రోజు మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతి దేవి అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం సాయంత్రం చిన్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు, చిన్న పిల్లలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు నూకల చంద్రకుమార్, సోము సాయిరాం, నూకల జగదీశ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు



రైల్వే కోడూరు, అక్టోబర్ 16, మనంన్యూస్ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని స్థానిక పాత బజారులో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం రోజున శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ప్రత్యేకంగా శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జ్ఞానప్రదాత అయిన సరస్వతీదేవి రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దివ్య రూపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుందని, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## ఎన్నికల వేళ అప్రమత్తం.. గొడవలకు దిగితే కఠిన చర్యలు..

ముద్దనూరు అక్టోబర్ 16 మనం న్యూస్: స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని సీఐ నగేష్‌బాబు తెలిపారు. ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ముద్దనూరు మండలంలోని బందలకుంట గ్రామాన్ని సందర్శించిన సీఐ, ఎన్నికల సందర్భంగా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. ఎలాంటి ఉద్రిక్తతలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.







# ఓటమి భయంతోనే పుంగనూరు, రాయచోటిలో వైకాపా బరితెగింపు

### రాజంపేట తెదేపా ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ధ్వజం

రాజంపేట:అక్టోబర్ 16(మనం న్యూస్)

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బరితెగించి దాడులకు తెగబడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు, రాయచోటి పరిసరాల్లో వైకాపా శ్రేణులు సాగించిన దౌర్జన్యాలు, దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రశ్నించే గొంతులను నొక్కి, వ్యవస్థలను సర్వనాశనం చేసిన వైకాపాకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినా వారి మనస్తత్వం, నేర ప్రవృత్తి ఏమాత్రం మారలేదని మండిపడ్డారు. అధికారం కోల్పోయినప్పటికీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కూటమి అభివృద్ధిని చూసి ఓర్వలేకే దాడులు:**

"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోంది. కుదేలైన ఆర్థిక వ్యవస్థను, నాశనమైన వ్యవస్థలను చక్కదిద్దుతుంటే ప్రజలు హర్షిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమికి తిరుగులేని విజయం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఎన్నికలను అడ్డుకోవాలనే కుట్రతో పుంగనూరు, రాయచోటిలలో పథకం ప్రకారం అల్లర్లు సృష్టించారు" అని జగన్ మోహన్ రాజు ఆరోపించారు.

**నామినేషన్ల కేంద్రం వద్ద మిథున్ రెడ్డికి పనేంటి?:**

గతంలో నామినేషన్లు వేయనీయకుండా అక్రమ ఏకగ్రీవాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వైకాపా నేతలు.. ఇప్పుడు నిబంధనల ప్రకారం ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుంటే సహించలేకపోతున్నారని విమర్శించారు. పుంగనూరులో నామినేషన్ కేంద్రం వద్దకు ఎంపీ మిథున్ రెడ్డి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి పాత పద్ధతిలోనే అరాచకాలు సాగించవచ్చని భావించారా అని నిలదీశారు. అక్కడ తెదేపా కార్యకర్తలు ప్రతిఘటించడంతోనే వైకాపా శ్రేణులు దాడులకు దిగాయని పేర్కొన్నారు. రాయచోటిలో స్థానిక మంత్రి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని తట్టుకోలేక, పరాజయం ఖాయమని తేలడంతో తెదేపా శ్రేణులపై దాడులు చేసి, కార్లను దగ్ధం చేశారని జగన్ మోహన్ రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

**ప్రవర్తన మార్చుకోకపోతే గుణపాఠం తప్పదు:**

వైకాపా నేతలు ఇప్పటికైనా తమ రౌడీయిజం, ఫ్యాక్షనిజం ప్రవృత్తిని మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు, ప్రభుత్వం తరఫున మరింత గట్టిగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రజలంతా వైకాపా అరాచకాలను తిప్పికొట్టి, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలిపి అత్యద్భుతమైన విజయాన్ని అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబులవారిపల్లి ఎంపీటీసీ-2 జనసేన అభ్యర్థిగా కటికం నాగేంద్రకు అవకాశం ఇవ్వాలి

### పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నిబద్ధత కలిగిన నాయకుడికి గుర్తింపు దక్కాలి

### జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశా.. అవకాశం ఇస్తే విజయం ఖాయం: కటికం నాగేంద్ర

ఓబులవారిపల్లి, అక్టోబర్ 16, మనం న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం కటికంవారిపల్లికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు, రైల్వే కోడూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల పరిశీలకులు కటికం నాగేంద్ర స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి సిద్ధమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబులవారిపల్లి ఎంపీటీసీ-2 స్థానం నుండి జనసేన పార్టీ తరపున పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఆయన పార్టీ అధిష్టానాన్ని, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**పార్టీ బలోపేతానికి నిరంతర కృషి**

ఈ సందర్భంగా కటికం నాగేంద్ర మాట్లాడుతూ గడచిన ఎన్నో ఏళ్లుగా జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నానని తెలిపారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుంటూ నియోజకవర్గంలో పార్టీ జెండాను




ముందుకు తీసుకెళ్లానని గుర్తుచేశారు.

**కూటమి విజయానికి అహర్నిశల శ్రమ**

2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తనవంతుగా తీవ్రంగా కృషి చేశానని తెలిపారు. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ధర్మాన్ని పాటిస్తూ, స్థానిక శాసనసభ్యులు అరవ శ్రీధర్ భారీ మెజార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశామని పేర్కొన్నారు.

**కూటమిలో భాగంగా ఎంపీటీసీ-2 కేటాయించాలి**

ఓబులవారిపల్లిలో ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాల్లో కూటమి ఒప్పందంలో భాగంగా ఒకటి టీడీపీకి వెళ్లినప్పటికీ, రెండవ స్థానమైన ఎంపీటీసీ-2 ను జనసేన పార్టీకి కేటాయించి, తనను అభ్యర్థిగా నిలబెడితే భారీ మెజార్టీతో గెలిపించి పార్టీకి కానుకగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం ప్రాణపణంగా పనిచేసిన నాకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత లభిస్తుందని ఆశిస్తున్నట్లు, జనసేన అధిష్టానం మరియు కూటమి నాయకత్వం తన సేవలను గుర్తించి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ట్రాన్స్ పార్మర్ల దొంగల ముఠా అరెస్ట్.. ఒక బైక్..75కిలోల కాపర్ వైర్ స్వాధీనం

చిట్వేలి అక్టోబర్ 16 మనం న్యూస్: రైతులను హడలెత్తించిన ట్రాన్స్ పార్మర్ల దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక బైక్, 75కిలోల కాపర్ వైర్ ను స్వాదినం చేసుకున్నట్లు ఎస్ఐ. వినోద్ కుమార్ శుక్రవారం తెలియజేశారు. స్థానిక పోలీసు స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు రూరల్ సిఐ.శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, డిఎస్పి వై.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ట్రాన్స్ పార్మర్ల దొంగల ముఠాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని నాగవరం శివారులోని చిట్వేలి- రైల్వేకోడూరు ప్రధానరహదారిలో ఎస్ఐ.వినోద్ కుమార్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి మోటార్ సైకిల్ పై దోటి పెట్టుకొని వెళ్తుండడాన్ని గమనించి వెనుకనే వెళ్ళి చూడగా నలుగురు వ్యక్తులు ట్రాన్స్ పార్మర్లనుపగుల కొడుతుండగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. వీరిని విచారించగా ప్రస్తుతం చిట్వేలి మండల పరిధిలోని మల్లాలమ్మఎస్టీ కాలనిలో నివాసం ఉంటున్న పాముల. వాసు, చీకోలు మల్లికార్జున, చీకోలు శంకర్, రైల్వేకోడూరు మండలం వివికంద్రిక ఎస్టీ కాలనీ నివాసి మొలకల అశోక్ లను అదుపులోకి తీసుకోగా మడి చెరువు చరణ్ పారిపోయాడన్నారు. అనంతరం వారి వద్దనుంచి ఏపీ-39-కే కే 9381నంబరుగల హీరోహోండా మోటార్ బైక్, 75కిలోల కాపర్ వైర్ స్వాదినం చేసుకున్నామన్నారు. వీరు చిట్వేలి మండలంలో 4కేసుల్లో 7.ట్రాన్స్ఫార్మర్లు, రైల్వేకోడూరులో 4కేసుల్లో 14 ట్రాన్స్ఫార్మర్లు, ఓబులవారిపల్లి మండలంలో 3కేసుల్లో 33 ట్రాన్స్ఫార్మర్లు, పుల్లంపేట మండలంలో 3కేసుల్లో 3ట్రాన్స్ పార్మర్లు మొత్తం 57ట్రాన్స్ పార్మర్లను పగులగొట్టి ఈ మధ్యకాలంలో రైతులను ఇబ్బందులకు గురిచేసి హడలెత్తించారన్నారు. పరారైనా వ్యక్తికోసం గాలిస్తున్నామని సిఐ.శ్రీనివాసులు, ఎస్సై వినోద్ కుమార్ తెలియజేశారు. ట్రాన్స్ పార్మర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులను పోలీసులు కోరారు. అనంతరం దొంగలను పట్టుకోవడంలో విశేషకృషి చేసిన పోలీసులకు



నగదు బహుమతులను అందజేశారు. నగదు రివార్డు అందుకున్న వారిలో ఏఎస్.ఐ.వెంగయ్య, పిసి.సుధాకర్, హోమ్ గార్డులు శ్రీనివాసులు, మోహన్ రాజు లను సిఐ, ఎస్సై అభినందించారు.



# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

## శ్రీకాంత్‌రెడ్డికి మంత్రి మండిపల్లి సవాల్



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 16

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. "నేను చేపట్టిన పనులను ప్రజల ముందే చూపిస్తా.. గతంలో మీరు చేసిన పనులేంటో చూపించే దమ్ముందా?" అని నిలదీశారు. రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలు, ప్రస్తుత అభివృద్ధి పనుల వివరాలను గణాంకాలతో సహా వెల్లడించారు.

**పాతికేళ్ల నిర్లక్ష్యానికి తెర.. రికార్డు పనులు**

వెనుకబడిన రాయచోటిని అభివృద్ధి పథంలో నిలిపేందుకు రెండున్నరేళ్లలోనే విశేష కృషి చేశామని మంత్రి పేర్కొన్నారు. గత 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా తాగు, సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు.

జల్ జీవన్ మిషన్: రూ.450 కోట్లతో ఆరు మండలాల తాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

శ్రీనివాసపురం ప్రాజెక్టు: సుమారు రూ.420 కోట్ల వ్యయంతో పనులు సాగుతున్నాయని, దీనిద్వారా 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు.

అమృత్ పథకం నిధులను సద్వినియోగం చేసుకోకుండా వెనక్కి పంపిన ఘనత వైకాపాదేనని విమర్శించారు. పట్టణంలో రూ.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, సుందరీకరణ పనులు, గాలివీడు పరిధిలో మౌలిక వసతుల కల్పన తమ హయాంలోనే జరుగుతున్నాయన్నారు.

**కార్యకర్తలను బలిపశువులను చేయొద్దు**

శ్రీకాంత్‌రెడ్డి తీరుపై మంత్రి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "రెండున్నరేళ్లుగా కార్యకర్తల ముఖం చూడని వ్యక్తి.. ఇప్పుడు ఎన్నికలు రాగానే అధినేత మెప్పు కోసం చిల్లర రాజకీయాలకు దిగుతున్నారు" అని మండిపడ్డారు. వైకాపా శ్రేణులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించే కుట్ర జరుగుతోందన్నారు. తాను అభ్యర్థులను బెదిరించలేదని, శ్రీకాంత్‌రెడ్డి రాజకీయ పబ్బం కోసం కార్యకర్తలు బలి కావద్దని మాత్రమే హితవు పలికానన్నారు.

**దమ్ముంటే 40 రోజులు ఇక్కడే ఉండు..**

"అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి, ఓడిపోయాక రాయచోటి మొహం చూడని వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారు. నిజంగా దమ్ముంటే వచ్చే 40 రోజుల పాటు ఇక్కడే ఉండి కార్యకర్తలకు అండగా నిలబడాలి" అని మంత్రి సవాల్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల పూర్తయ్యే వరకు ప్రజల మధ్యే ఉంటానని స్పష్టం చేశారు.

**కష్టపడి ఎదిగాను..**

తాను 22 ఏళ్ల పాటు ప్రజల్లో ఉంటూ, అంచలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చానని, ఎవరి కాళ్లూ పట్టుకుని పదవులు పొందలేదని స్పష్టం చేశారు. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. రాయచోటికి తెచ్చిన ప్రతి పైసా లెక్క ప్రజల ముందుంచేందుకు తాను సిద్ధమని, అనవసర వ్యక్తిగత విమర్శలకు దిగితే తగిన రీతిలోనే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం.. నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష



ఒంటిమిట్ట అక్టోబర్ 16 మనంన్యూస్ : మైనర్ బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ కడపలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఒంటిమిట్ట మండలం కొటికెవారిపల్లికి చెందిన కొటికె బ్రహ్మయ్య (21) ఈ కేసులో నిందితుడు. పోలీసుల వివరాల ప్రకారం.. 2023 మే 3న ఒంటిమిట్ట మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మేకలను మేపుకుని ఇంటికి తిరిగి వస్తుండగా బ్రహ్మయ్య ఆమెను అడ్డగించి కత్తితో బెదిరించాడు. బలవంతంగా గుంతలోకి లాగి లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాలిక ప్రతిఘటించడంతో ఆమెపై దాడి చేశాడు. నిందితుడి చెర నుంచి తప్పించుకున్న బాలిక జరిగిన విషయాన్ని బంధువులకు తెలిపింది. మరుసటి రోజు బంధువులతో కలిసి ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి ఒంటిమిట్ట ఎస్ఐ బి. మధుసూధన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి సిద్దవటం ఎస్ఐ తులసి నాగప్రసాద్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. దర్యాప్తు పూర్తి చేసిన మధుసూధన్‌రావు 2023 జులై 6న ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన కడప పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.ఎ. సోమశేఖర ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి ఛార్జిషీట్ దాఖలు చేసిన అప్పటి ఎస్ఐ బి. మధుసూధన్‌రావు, నిందితుడి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన తులసి నాగప్రసాద్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వేణుగోపాల్‌తో పాటు కోర్టు మానిటరింగ్ సెల్, ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ అభినందించారు. కేసును పర్యవేక్షించిన సీఐ పి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ వి. శ్రీనివాసులును ప్రశంసించారు. మహిళలు, బాలికలపై వేధింపులు, లైంగిక దాడులు లేదా ఇతర నేరాల సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కడప జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. మహిళలు, బాలికల రక్షణకు ప్రాధాన్యమిస్తూ నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రాజంపేటలోకి భారీగా స్వచ్ఛందంగా జనసేనలోకి చేరికలు

### – తోట వెంకట్,ఎల్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేనలోకి 200 కుటుంబాలు



రాజంపేట అక్టోబర్ 16(మనం న్యూస్) : రాజంపేట ప్రాంతంలో భారీగా ప్రజలు స్వచ్ఛందంగా జనసేనలోకి చేరుతున్నారు. ఇందులో భాగంగా రాజంపేట పట్టణంలోని సాయి నగర్ లో శుక్రవారం 22వ వార్డుకు చెందిన తోట వెంకట్ ఎల్ వి ప్రసాద్ ఆధ్వర్యంలోఒకేసారి రెండు వందల కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజంపేట జనసేన పార్లమెంటు ఇంచార్జి సమన్వయకర్త అతికారి కృష్ణ కు ముందుగా భారీ గజమారాలతో స్వాతం పలికారు. అనంతరం జనసేన ఆకర్షితులకు అతికారి కృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట యువతకు మరియు ప్రజలకు జనసేన పార్టీ అంటే ఎంత మక్కువ ఉందో.. ఎంత ఆప్యాయత ఉందో నాకు ఇప్పుడు అర్థమవుతుందని, యువత మరియు కుటుంబాలు స్వచ్ఛందంగా పవన్ కళ్యాణ్ గారి నాయకత్వాన్ని నమ్మి జనసేన పార్టీలో చేరడం రాజంపేట నియోజకవర్గం జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఇక్కడ పార్టీ మరింత పుంజుకోవడానికి ఇది ఒక శుభ పరిణామం అన్నారు. తోట వెంకట్ , ఎల్ వి ప్రసాద్ వంటి స్థానిక నేతలు తమ మద్దతుదారులతో కలిసి పార్టీలో చేరడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూరినట్లు అయిందన్నారు. పవన్ కళ్యాణ్ గారి కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి పనులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె ఎస్ నరసింహ, కొరముట్ల హరి, ఒంటిమిట్ట సింగల్ విండో చైర్మన్ జయ కృష్ణ , సిద్ధవటం ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్, సురేంద్ర, నరేష్ , మల్లెం సుబ్బయ్య, గిరీష్, గంగయ్య, బాబి, సునీల్, అతికారి చిన్న , వెంకటయ్య, మల్లి తదితరులు పాల్గొన్నారు.



## ఏ 4 రిటైల్ లిక్కర్ షాపుల కేటాయింపునకు నోటిఫికేషన్ విడుదల




రైల్వే కోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనల (2026-27) ప్రకారం, తిరుపతి జిల్లా పరిధిలోని రైల్వే కోడూరు ప్రాంతంలో ఏ4 రిటైల్ లిక్కర్ షాపుల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రైల్వే కోడూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ టి కె తులసి తెలిపారు. ఈ షాపులను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించనున్నట్లు,

?ఈ నోటిఫికేషన్ కింద రైల్వే కోడూరు పరిధిలో 2 షాపులు (జిఎస్ఎల్ నంబర్లు 44, 52), చిట్వేల్ పరిధిలో 1 షాపు (జిఎస్ఎల్ నంబరు 56), మరియు ఓబులవారిపల్లె పరిధిలో 1 షాపు (జిఎస్ఎల్ నంబరు 62) చొప్పున మొత్తం 4 షాపులను కేటాయించడం జరిగింది.

?ఈ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి, దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీని 19.10.2026 అర్ధరాత్రి వరకు నిర్ణయించారు. అలాగే లాటరీ నిర్వహణ తేదీని 21.10.2026 న తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రుసుము రూ.3,01,000/- మూడు లక్షల ఒక్క వెయ్యి రూపాయలు గా చెల్లించాల్సి ఉంటుంది.

?మరిన్ని వివరాల కోసం రైల్వే కోడూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ నంబరు 9492856911 ను లేదా ఎస్.ఐ నంబరు 9492630970 ను సంప్రదించవచ్చు. అలాగే అధికారిక వెబ్‌సైట్ హ్ట్ట్ప్స్://శీఎ.ప్టటజూంజూతీశీ-ఽవఝ.ఽశీఎ ద్వారా కూడా సమాచారాన్ని పొందవచ్చు. అర్హత గల అభ్యర్థులు 2026-27 సంవత్సరానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించడమైనది అని అన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి బిందె సేవ



రైల్వేకోడూరు, అక్టోబర్ 16, మనం న్యూస్ : రైల్వేకోడూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బిందె సేవ (కలశ సేవ) మహోత్సవాన్ని అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, దివ్యమైన అలంకరణలు చేపట్టారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బిందె సేవతో ఆలయ పరిసరాలన్నీ వేదమంత్రోచ్చారణలు, భక్తి సంకీర్తనలతో మార్మోగుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ పూజా మహోత్సవంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ మాట్లాడుతూ అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ ఈ బిందె సేవ కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక నిష్ఠతో నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఆర్యవైశ్య సంఘ సభ్యులతో పాటు యువజన సంఘం సభ్యులు, మహిళా మండలి ప్రతినిధులు మరియు పట్టణానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా జయప్రదం చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ గావించారు.

## సరస్వతీ దేవి అలంకరణలో విజయదుర్గాదేవి



సిద్దవటం, అక్టోబర్ 16 మనం న్యూస్: మండలంలోని సాయినగర్ గ్రామంలో వెలసిన శ్రీభద్రావతి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గామాత అమ్మవారు శుక్రవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రులలో భాగంగా 6వ రోజు అమ్మ వారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారన్నారు. అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, సహస్ర నామార్చన, లలితా సహస్ర నామ కుంకుమార్చన, వంటి పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఎంపీ మిథున్ రెడ్డి పై దాడి అమానుషం.. తీవ్రంగా ఖండించిన మళ్లీశెట్టి



చిట్వేలి అక్టోబర్ 16 మనం న్యూస్: ఎంపీ మిథున్ రెడ్డి పై అల్లరి మూకల దాడి అమానుషమని వైఎస్సార్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మలిశెట్టి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం చిట్వేలిలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం పుంగనూరు నియోజకవర్గంలో మున్సిపాలిటీ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన మిథున్ రెడ్డి పై దాడిచేయడం అన్యాయమన్నారు. ఒక ఎంపీ పై ఇలాంటి దాడి జరిగితే ఇక సామాన్య ప్రజల సంగతి ఏమిటని వెంకటరమణ ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మలిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు.